


గ్రామాల అభివృద్ధికి కృషి

పెద్దేముల్ మండలం జనగాంలో రోడ్డు పనులను కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి ప్రారంభించారు. 9లో▸



సామాజిక అంశాలపై..

సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని బండవెల్కిచర్ల జెడ్పీ పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నర్సింలు అన్నారు. 9లో▸



న్యూస్‌రీల్

రైతులకు పరిహారం చెక్కులు అందజేత



మహిళా రైతుకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: దుద్యాల్ మండలం హకీంపేట్‌లో పారిశ్రామిక పార్క్ కోసం భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన రైతులకు శనివారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ తన కార్యాలయంలో పరిహారం చెక్కులు అందజేశారు. గ్రామ సర్వే నంబర్ 252లో 31 మంది రైతులకు చెందిన 55.35 ఎకరాల భూమిని పారిశ్రామిక పార్క్ కోసం సేకరించారు. ఇందుకు సంబంధించిన చెక్కులను కలెక్టర్ రైతులకు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కల్పిస్తున్నాం

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



అధికారులతో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తదితరులు

అనంతగిరి: వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కులు, స్థిరమైన జీవన విధానికి న్యాయమైన ప్రవర్తన అనే అంశంపై అధికారులు, వినియోగదారులకు పలు సూచనలు చేశారు. వస్తు కొనుగోలులో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒకవేళ మోసానికి గురైతే ఎక్కడ ఫిర్యాదు చేయాలో వివరించారు. అన్ని రకాల దుకాణాలను తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీసీఎస్‌ఓ మోహన్‌బాబు. డీఎల్ ఎంఓ రియాజ్, కలెక్టరేట్ ఏఓ ఫరీనాఖాతూన్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా ఉండండి

అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ శ్రీదేవి సరస్వతి



మల్కాపూర్ శివారులో పర్యటిస్తున్న శ్రీదేవి సరస్వతి తదితరులు

తాండూరు రూరల్: మండలంలో ఎలుగుబంటి, చిరుతపులి పిల్ల సంచరిస్తున్నందున ప్రజ లు అప్రమత్తంగా ఉండాలని తాండూరు అటవీ శాఖ రేంజ్ అధికారి శ్రీదేవి సరస్వతి సూచించారు. శనివారం మండలంలోని బెల్కటూర్, మల్కాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మల్కాపూర్ శివారులో చిరుతపులి పిల్ల తిరుగుతున్నట్లు కార్మికుల నుంచి తమకు సమాచారం వచ్చిందన్నారు. అక్కడి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి క్వారీ సమీపంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే బెల్కటూర్ సమీపంలో ఎలుగుబంటి సంచరిస్తోందని తెలిపారు. అక్కడ కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పాలిషింగ్ యూనిట్ నిర్వాహకులను కోరినట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



తాండూరు: తాండూరు బ్రాహ్మణ అర్చక, పురోహిత సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా పురందరాచార్ శుక్రవార్, కార్యదర్శిగా సుధీంద్రాచారి, సహ కార్యదర్శిగా నాగరాజ్, కోశాధికారిగా సుమన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. కార్యవర్గం కాలపరిమితి 2025 నుంచి 28 వరకు ఉంటుందని పేర్కొన్నారు.

అప్రమత్తతే రక్ష

ఎండలు ముదురుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు అవసరం



- వడదెబ్బ బారిన పడకుండా చూసుకోవాలి
- ఉదయం 11నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇంట్లో ఉంటేనే సేఫ్
- వైద్య ఆరోగ్య శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం
- 'సాక్షి'తో జిల్లా వైద్యాధికారి వెంకటరవణ



ఎండ తీవ్రత కారణంగా ధారూరు బస్టాండ్‌లో సేదతీరుతున్న ప్రయాణికులు



వెంకటరవణ

వికారాబాద్: 'ఎండల తీవ్రత రోజు రోజుకు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. లేకుంటే వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంది.. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వైద్య ఆరోగ్య శాఖ పరంగా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం'.. అని డీఎంఅండ్ హెచ్‌ఓ వెంకటరవణ అన్నారు. ఎండల నుంచి ఎలా ఉపశమనం పొందాలి.. వడదెబ్బ బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. శాఖా పరంగా తీసుకుంటున్న చర్యలను శనివారం ఆయన 'సాక్షి'కి వివరించారు. ఆయన మాటల్లోనే..

అత్యవసరం అయితే తప్ప బయటికి రావొద్దు

పదిహేను రోజులుగా ఎండలతోపాటు వడగాల్పుల తీవ్రత పెరుగుతోంది. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ సూచనలతో శాఖా పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వడదెబ్బకు గురయ్యే సమయంలో చేయాల్సిన ప్రథమ చికిత్స, చేయకూడని పనులపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో 720 మంది ఆశా వర్కర్లు పనిచేస్తుండగా ప్రతి ఒక్కరి వద్ద వంద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 200ల చొప్పున అందుబాటులో ఉన్నాయి. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశంలో కూడా వీటిని అందుబాటులో ఉంచాం. ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు రాకూడదు. వృద్ధులు, పిల్లలు మరింత జాగ్రత్తగా ఉండాలి. మధుమేహం, రక్తపోటు లాంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు క్రమం తప్పకుండా మందులు వాడాలి. ఉదయం 11నుంచి సాయంత్రం 5గంటల వరకు బయటకు రాకపోవడం మంచిది. ఒకవేశ బయటకు వెళ్లాల్సి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.. ఇందులో భాగంగా ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, పీహెచ్‌సీ వైద్యులు, పట్టణ, పల్లె, బస్తీ దవాఖానాల్లో విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బందిని అప్రమత్తం చేశాం. ఒకవేళ ప్రజలు వడదెబ్బ బారిన పడితే ఎలాంటి వైద్యం చేయాలి.. ఏ ఆస్పత్రికి తరలించాలి.. అనే విషయాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. వైద్య ఆరోగ్య శాఖ పరంగా తీసుకుంటున్న చర్యలపై ఎప్పటికప్పుడు రివ్యూ చేస్తున్నాం.

వేసవిలో చేయకూడని పనులు

- సాధ్యమైనంత వరకు మండుటెండలో తిరగరాదు. అత్యవసరం ఉంటే తగు జాగ్రత్తలతో బయటకు వెళ్లాలి.
- ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మద్యానికి దూరంగా ఉండటం మంచిది. మద్యం సేవించడం వల్ల డీ హైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉంది.
- రోడ్ల పక్క విక్రయించే రంగుల శీతల పానీయాలను తాగకపోవడం మంచిది. కలుషిత ఆహారం కూడా తీసుకోరాదు.
- మాంసాహారం తగ్గించడం మంచిది..

రోజువారి ఆహారంలో పళ్లు, కూరగాయలు, నీటి శాతం ఎక్కువ ఉన్న ఆహారం తీసుకోవడం ఉత్తమం. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

ఇవి చేస్తే మేలు

- నీటితోపాటు పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.
- ఆహారం మితంగా తీసుకోవాలి.
- రోజుకు కనీసం 12నుంచి 15 గ్లాసుల నీరు తాగాలి. ఇలా చేయడం ద్వారా వడదెబ్బ బారిన పడే అవకాశం ఉండదు.
- వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు రోజుకు రెండు పూటలా స్నానం చేయాలి. కాటన్, పలచటి దుస్తులు, లేతవర్ణం దుస్తులు ధరించాలి.
- దోమతెరలు కచ్చితంగా వాడాలి..
- సాధ్యమైనంత వరకు ఇళ్లలో ఉండాలి. బయటకు వస్తే గొడుగు, టోపీ లాంటివి వాడాలి.

వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన చర్యలు

- వడదెబ్బకు గురైతే వెంటనే ప్రథమ చికిత్స చేసి దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలి.
- ప్రథమ చికిత్సలో భాగంగా వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడ ప్రదేశంలోకి చేర్చాలి. చల్లని ఫ్యాన్ గాలి తగిలేలా చూడాలి. తడి క్లాత్‌తో తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు తుడవాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ లేదా.. ఉప్పు కలిపిన గ్లూకోస్ నీరు.. ఓఆర్ఎస్ వాటర్ తాగించాలి.
- ఒకవేళ వడదెబ్బకు గురై అపస్మారక స్థితిలోకి చేరిన వ్యక్తికి నీరు తాగించరాదు.
- వీలైనంత తొందగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లాలి.
- ఇలాంటి చర్యలతో వడదెబ్బకు గురైన వారిని కాపాడుకోవచ్చని జిల్లా వైద్యాధికారి వెంకటరావణ తెలిపారు. అలాగే ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



బషీరాబాద్‌లో కొత్త కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్

రేషన్.. వచ్చెన్

- దశాబ్దకాల నిరీక్షణకు తెర
- జిల్లాలో కొత్తగా 22,388 రేషన్ కార్డులు జారీ
- మార్చి కోటా 5,603 మెట్రిక్ టన్నుల బియ్యం విడుదల

బషీరాబాద్: కొత్త రేషన్ కార్డుల కోసం దశాబ్ద కాలం పాటు ఎదురు చూసిన వారి నిరీక్షణకు తెరపడింది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామసభల ద్వారా తీసుకున్న దరఖాస్తులతో పాటు పెండింగ్ జాబితాలోని అర్హులకు కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. మార్చి కోటా బియ్యం కూడా విడుదల చేసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు ప్రామాణికం కావడంతో కొత్త కార్డుల జారీకి ప్రాధాన్యత సంతరించుకుంది.

జిల్లాలో 2,63,573 మంది లబ్ధిదారులు

కొత్త రేషన్ కార్డుల జారీతో జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య పెరిగింది. గతంలో 2,41,185 మంది లబ్ధిదారులు ఉండగా 5,337.31 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేసేవారు. కొత్తగా 22,388 కార్డులు అందుబాటులోకి రావడంతో అదనంగా 266.098 మెట్రిక్ టన్నుల బియ్యం కోటాను విడుదల చేశారు. దీంతో లబ్ధిదారుల సంఖ్య 2,63,573 మందికి చేరుకుంది. 26,730 అంత్యోదయ కార్డులు, 39 అన్నపూర్ణ యోజన కార్డులు ఉన్నాయి. కార్డులోని ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం అందిస్తున్నారు.

డిజిటల్ కార్డుల జారీకి కసరత్తు

సంక్షేమ పథకాల అమలులో అవకతవకలకు చెక్ పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా డిజిటల్ రేషన్ కార్డుల జారీకి కసరత్తు చేస్తోంది. కొత్తగా రూపొందించే కార్డులో కుటుంబ సభ్యులను చేర్చేందుకు.. తొలగించేందుకు సులువుగా ఉండేలా తయారు చేస్తున్నట్లు తెలిసింది. ఈ ప్రక్రియ పూర్తయితే జూన్ నెలలో డిజిటల్ రేషన్‌కార్డులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

దరఖాస్తు చేసుకున్న ఎనిమిదేళ్లకు..



ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయాక ఎనిమిదేళ్ల క్రితం కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేశా. కార్డు రాలేదు. నాతోపాటు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రజాపాలన గ్రామసభలో మళ్లీ దరఖాస్తు చేశా. ఇప్పుడు నా పేరిట రేషన్ కార్డు మంజూరైంది. ఇంకా బియ్యం తీసుకోలేదు.

– తలారి సావిత్రి, మంతట్టి

మీసేవ కేంద్రాల్లో డౌన్‌లోడ్ చేసుకోవాలి

జిల్లాకు కొత్తగా 22,388 రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన జాబితాను డీలర్లకు అందజేశాం. కార్డు మంజూరైన వారు మీసేవ కేంద్రాలు లేదా ఆన్‌లైన్ సెంటర్లలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కొత్త కార్డులకు మార్చి నెల కోటా బియ్యం పంపిణీ చేశాం.

– మోహన్‌బాబు, డీఎస్‌ఓ

ఏడాదిలో 980

గృహహింస కేసులు: 668

- కిడ్నాప్, మిస్సింగ్ కేసులు : 125
- అతివలపై ఆగని అకృత్యాలు
- చట్టాలెన్ని ఉన్నా పడని అడ్డుకట్ట
- సఖి కేంద్రాలకు ఫిర్యాదుల వెల్లువ

సఖి సెంటర్‌కు అందిన ఫిర్యాదులు

అంశం	కేసులు
గృహ హింస	668
అత్యాచారం	08
బాలికలపై లైంగిక వేధింపులు	45
బాల్య వివాహాలు	27
మిస్సింగ్/కిడ్నాప్‌లు	125
ఆన్‌లైన్ వేధింపులు	34
ఇతర కేసులు	73



సాక్షి, రంగారెడ్డిజిల్లా: అన్ని రంగాల్లో మగవాళ్లతో పోటీపడి దూసుకెళ్తున్న మహిళలపై హింస కొనసాగుతూనే ఉంది. పితృస్వామ్య, ఆధిపత్య భావ జాలం అడుగడుగునా సంకెళ్లు వేస్తోంది. ఇంటాబయట అడుగడుగునా వేధింపులు, హింస, హత్యలు, అత్యాచారాలు నిత్యకృత్యంగా మారాయి. ప్రభుత్వాలు గృహ హింస, నిర్భయ వంటి కఠిన చట్టాలను తెచ్చినప్పటికీ మహిళలపై హింస వ్యవస్థీకృతంగా కొనసాగుతూనే ఉంది. అభివృద్ధిలోనే కాదు అన్ని రంగాల్లోనూ అంతర్జాతీయ హంగులను సంతరించుకున్న జిల్లాలో 2024 ఫిబ్రవరి నుంచి 2025 ఫిబ్రవరి చివరి నాటికి 980 వివిధ రకాల కేసులు నమోదు కావడం పరిస్థితికి అద్దం పడుతోంది.

చిన్నప్పటి నుంచే ఆంక్షలు

పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారు. అయినా వివక్ష కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. చిన్నప్పటి నుంచే ఆంక్షలు, దాడులు కొనసాగుతున్నాయి. పెళ్లి తర్వాత అదనపు కట్నం, అందం, ఆడ పిల్లలకు జన్మ నివ్వడం వంటి కారణాలతో నిత్యం గృహ హింసకు గురవుతున్నారు. ఏడాది కాలంలో జిల్లాలోని సఖి కేంద్రాలకు వచ్చిన కేసులను పరిశీలిస్తే ఇదే స్పష్టమవుతోంది. అంతేకాదు ఈ గృహ కేసులు బాలబాలికల నిష్పత్తిపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. జిల్లాలో 1000 మంది బాలురకు 963 మంది బాలికలు ఉండటం గమనార్హం.

చిన్నవాటికే మనస్పర్థలు



దంపతుల మధ్య స్వార్థం పెరిగింది. ఈగో.. చిన్న చిన్న అంశాలకే గొడవపడుతున్నారు. కుటుంబ జీవితంపై కనీస అవగాహన ఉండడం లేదు. పెళ్లి తర్వాత భర్త తరపు తల్లిదండ్రులు, ఇతర బంధువులను భార్య దూరం చేస్తోంది. భార్య తరపు బంధువులను భర్త దూరం పెడుతున్నారు. అమ్మాయి సున్నితంగా ఉంటే అబ్బాయి తరపు బంధువులు డామినేట్ చేస్తున్నారు. అబ్బాయి మెతకగా కన్పిస్తే అమ్మాయి తరపు బంధువులు వేధిస్తున్నారు. తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు చెప్పినా వినడం లేదు. సఖి కేంద్రానికి వస్తున్న కేసుల్లో మెజార్టీ ఈ తరహాకు చెందినవే. నిజానికి వీరికి పెళ్లికి ముందే కౌన్సెలింగ్ ఇవ్వాల్సి ఉంది.

– వి.జోత్స్న సీడీపీఓ, సఖికేంద్రం, వనస్థలిపురం

ఫిర్యాదుల కోసం కాల్ సెంటర్



మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలను అమల్లోకి తెచ్చింది. అయినా హింస ఆగకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గృహ హింసకు గురయ్యే వారి కోసం 181 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. బాధితులు స్వయంగా ఫోన్ చేసి రక్షణ పొందొచ్చు. బాధితులకు రక్షణ కల్పించి, కౌన్సెలింగ్ ద్వారా కాపురాలను నిలబెట్టేందుకు సఖి కేంద్రాలను ఏర్పాటు చేసింది. వనస్థలిపురం, శంషాబాద్‌లో ఈ కేంద్రాలు ఉన్నాయి. వనస్థలిపురం సఖి కేంద్రంలో ఇప్పటివరకు 881కేసులు రాగా, 186 మినహా అన్నీ పరిష్కరించాం. శంషాబాద్ కేంద్రానికి 91కేసులు రాగా, 64 మినహా అన్ని కేసులు పరిష్కరించాం.

– సంధ్యారాణి, మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి

విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



విద్యార్థినికి మెడల్ అందజేస్తున్న నరేంద్రకుమార్

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.నరేంద్రకుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని ఎన్కెపల్లి సమీపంలో గల భాస్కర విద్యా సంస్థల్లో 25వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నరేంద్రకుమార్‌తో పాటు తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో రూపేష్, ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల కమాండ్ ఇంటెలిజెన్స్ అధికారి మేజర్ కునాల్‌సింగ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పౌష్టికాహారం, సరిపడా నిద్ర, వ్యాయామం ఎంతో అవసరం అని అన్నారు. పట్టుదల, కృషి ఉంటే భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చని తెలిపారు. రూపేష్, మేజర్ కునాల్‌సింగ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరం అన్నారు. అనంతరం విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. కళాశాల కార్యదర్శి కృష్ణారావు,బీఎంసీ డైరెక్టర్ దీపిక పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు వేళాయె!



ఈ నెల 21నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు టెన్త్ ఎగ్జామ్స్

- ఏర్పాట్లలో నిమగ్నమైన విద్యాశాఖ
- జిల్లాలో 69 పరీక్ష కేంద్రాలు, 12,901 మంది విద్యార్థులు
- ఠాణాలకు చేరిన ప్రశ్న పత్రాలు

తాండూరు: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 21నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 69 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు విద్యాశాఖ, రెవెన్యూ, పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గత ఏడాది చోటుచేసుకున్న పేపర్ లీకేజీ వంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. జిల్లాలో మొత్తం 307 పాఠశాలలు ఉండగా 12,901 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో 6,452 మంది బాలికలు, 6,449 మంది బాలురు ఉన్నారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి.

జిల్లాకు చేరిన ప్రశ్నపత్రాలు

పదో తరగతి ప్రశ్న పత్రాలు జిల్లాకు చేరాయి. శనివారం వాటిని ఆయా కేంద్రాల సమీపంలోని పోలీస్ స్టేషన్లకు తరలించి భద్రపరిచారు. మరి కొన్ని సబ్జెక్టులకు సంబంధించిన పేపర్లు రావాల్సి ఉంది. మరో రెండు మూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉంది.

పాఠశాలల వారీగా పదో తరగతి విద్యార్థులు

విద్యా సంస్థలు	స్కూళ్ల సంఖ్య	బాలికలు	బాలురు
జెడ్పీహెచ్ఎస్	165	2,676	3,163
ప్రభుత్వ	9	296	131
ఎయిడెడ్	2	14	16
కేజీబీవీ	18	831	0
ప్రైవేట్	69	1,211	1,596
బీసీ వెల్ఫేర్	10	287	379
ఎస్సీ వెల్ఫేర్	7	238	293
ఎస్టీ వెల్ఫేర్	4	149	140
ఎస్టీ ఆశ్రమ	6	197	124
టీఎంఆర్ఐఈఎస్	6	113	151
టీఎస్ఎంఎస్	9	295	456
టీఆర్ఈఐఎస్	2	145	0

పరీక్షల నిర్వహణకు 920 మంది అధికారులు

జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు 920 మంది అధికారులు, సిబ్బందిని నియమించారు. 8మంది కస్టోడియన్లు, 69 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 69మంది సూపరింటెండెంట్లు, 5 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 700 మంది ఇన్విజిలేటర్లు, 69 మంది సిట్టింగ్ స్క్వాడ్ సిబ్బందిని నియమించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

అన్ని ఏర్పాట్లు చేశాం



పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. గత సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాం. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను నిషేధించాం. పరీక్ష విధులకు హాజరయ్యే సిబ్బందికి కూడా ఆ ఆదేశాలు వర్తింపజేశాం. జిల్లా వ్యాప్తంగా 69 కేంద్రాలు, 12,901 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.

– రేణుకాదేవి, డీఈఓ

క్లుప్తంగా

బైక్ దొంగకు రిమాండ్



హాజీ

ఆమనగల్లు: బైక్‌ను చోరీ చేసిన వ్యక్తిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని విఠాయిపల్లి గ్రామానికి చెందిన సబావత్‌వాల్య గత ఏడాది డిసెంబర్‌లో తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఎదుట పార్క్ చేయగా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌కు చెందిన హాజీ బైక్‌ను చోరీ చేసినట్లు గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హాజీని కోర్టులో హాజరు పర్చి, రిమాండ్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ గర్భిణి మృతి

వైద్యుల నిర్లక్ష్యమంటూ బంధువుల ఆరోపణ

శంషాబాద్ రూరల్: ఛాతి నొప్పితో ఆస్పత్రికి వెళ్లిన ఓ గర్భిణి మృతి చెందింది. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మహేశ్వరం మండలం అమీర్‌పేట్ నివాసి బుషమోని ప్రమీల(33) 9 నెలల గర్భిణి. మొదటి నుంచి ముచ్చింతల్ శివారులోని జిమ్స్ ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతుంది. నెలలు నిండడంతో ప్రమీలను ఈ నెల 11న జిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. 13వ తేదీ వరకు ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్న ఆమెను వైద్యులు ఇంటికి పంపించారు. 18న ఆస్పత్రికి రావాలంటూ డాక్టర్ పూజిత కొన్ని మందులు రాసిచ్చారు. శుక్రవారం రాత్రి ప్రమీల భోజనం తర్వాత వైద్యులు ఇచ్చిన మందులు వేసుకుంది. కాసేటి తర్వాత ఛాతిలో నొప్పి రావడంతో భర్త సాయిబాబు ఆమెను రాత్రి 10.30 గంటలకు జిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఈ సమయంలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో నర్సులు ఆమెను పరిశీలించారు. 12.15 గంటలకు డాక్టర్ రామారావు ఆమెను పరీక్షించగా అప్పటికే చనిపోయింది. సకాలంలో వైద్యం అందక తన భార్య మృతి చెందిందని, ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సాయిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం మత్తులో యాసిడ్ తాగి వృద్ధుడి మృతి

శంషాబాద్ రూరల్: మద్యం తాగిన మత్తులో ఓ వృద్ధుడు యాసిడ్ తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని నర్కూడ వాసి కమ్మరి ఆనంద్ చారి(62) ఈ నెల 14న హోలీ ఆడి సాయంత్రం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. రాత్రి తాగిన మత్తులో బాత్రూంలోకి వెళ్లి అక్కడ ఉన్న యాసిడ్ తాగి బయటకు వచ్చాడు. అతని షర్ట్‌పై మరకలను గమనించిన భార్య లక్ష్మి బాత్రూమ్‌లోకి వెళ్లి చూసింది. యాసిడ్ బాటిల్ మూత తీసి ఉండడంతో పాటు అందులో యాసిడ్ సగం మాత్రమే ఉంది. వెంటనే అతన్ని శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి..అక్కడి నుంచి ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లగా..చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలంలో డంపింగ్

మణికొండ: ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా ఓ నిర్మాణ సంస్థ డంపింగ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదని కోకాపేటవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట రెవెన్యూ సర్వే నెంబర్ 144లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దాని పక్కనే ఓ నిర్మాణ సంస్థ తమ కార్యకలాపాలను కొనసాగిస్తుంది. బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌ను ప్రభుత్వ భూమిలోకి పడేయటంతో పక్కనున్న నివాసాల్లో దుమ్ము చేరుతుంది. దాంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇదే విషయాన్ని అటు నిర్మాణ సంస్థ, ఇటు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మట్టి.. కొల్లగొట్టి!



పెద్దమంగళారంలో డంప్ చేసిన నల్లమట్టి



పెద్దమంగళారం పెద్ద చెరువులో మట్టి తరలింపుతో ఏర్పడిన గుంతలు

యథేచ్ఛగా అక్రమ దందా!

- చెరువులు, కుంటల నుంచి మట్టి తరలిస్తున్న అక్రమార్కులు
- ప్రభుత్వ భూములే లక్ష్యంగా తవ్వకాలు
- రాత్రి వేళ, సెలవుదినాల్లో టిప్పర్ల ద్వారా తరలింపు
- ఫాంహౌస్‌లలో పోసి సొమ్ము చేసుకుంటున్న వైనం

మొయినాబాద్: అక్రమార్కులకు మట్టే బంగారమవుతోంది. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల్లో నుంచి తరలించుకుపోయి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి సమయంలో మట్టిని తీసుకెళ్లి డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి ఫాంహౌస్‌లకు విక్రయిస్తున్నారు. ఇలా నిత్యం వందలాది టిప్పర్ల మట్టి తరలిపోతోంది. నగరానికి కూత వేటు దూరంలో ఉన్న మొయినాబాద్‌లో ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. టిప్పర్ల యజమానులు నిత్యం ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల్లో మట్టి తవ్వి విక్రయిస్తున్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారం పెద్ద చెరువులో నుంచి కొద్ది రోజులుగా నల్లమట్టిని తరలించుకుపోతున్నారు. రాత్రి వేళటిప్పర్ల ద్వారా తీసుకెళ్లి ఒకచోట డంప్ చేసుకుంటున్నారు. ఆతర్వాత ఫాంహౌస్‌లకు అమ్ముతున్నారు. మండలంలోని నాగిరెడ్డిగూడ సమీపంలో ఉన్న హిమాయత్‌సాగర్ చెరువులో నుంచి సైతం నల్లమట్టిని తరలిస్తున్నారు. అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల నుంచి ఎర్రమట్టి, మొరం తవ్వుతున్నారు. పెద్దమంగళారం, అప్పోజీగూడ, మేడిపల్లి ప్రాంతాల్లో ఎర్రమట్టి, కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, నక్కపల్లి, తోలుకట్ట ప్రాంతాల నుంచి మొరం తరలిస్తున్నారు. ఇలా నిత్యం వేలాది రూపాయల దందా నిర్వహిస్తున్నారు.

సెలువు రోజుల్లోనే అధికంగా..

సెలవు రోజులను ఎంచుకుని అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. అధికారులు ఎవ్వరూ అందుబాటులో ఉండరనే వ్యూహంతో హోలీ డేస్‌ను ఇలా వినియోగించుకుంటున్నారు. చెరువులు, కుంటలను కాపాడాల్సిన ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదులు వచ్చినప్పుడే స్పందిస్తున్నారు. ఆతర్వాత నిఘా పెట్టడంలేదనే విమర్శలు వస్తున్నాయి. రెవెన్యూ శాఖలో గ్రామస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో పంచాయతీల్లో జరుగుతున్న అక్రమాలు అధికారులకు తెలియడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే ఇవి వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికైనా అక్రమ మట్టి రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కేసులు నమోదు చేశాం

పెద్దమంగళారం పెద్ద చెరువులో నల్ల మట్టి తవ్వుతున్నట్లు గతంలో ఫిర్యాదులు వచ్చాయి. మట్టి తీస్తున్నవారిపై అప్పట్లోనే కేసులు నమోదు చేశాం. మళ్లీ ఎవరైనా మట్టి తీస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. మండలంలోని అన్ని చెరువులపై ప్రత్యేక నిఘా పెడతాం.

– ప్రియాంక, ఇరిగేషన్ ఏఈ, మొయినాబాద్

పట్టాలు అడ్డుపెట్టి చెరువును చెరబట్టి

జంబులకుంట చెరువులో నిబంధనలకు విరుద్ధంగా పనులు

- శిఖం పట్టాలను అడ్డం పెట్టుకుని కట్టను ధ్వంసం చేస్తున్న వైనం
- చెరువు ఆనవాళ్లను మాయం చేసే కుట్ర
- ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన స్థానికులు

మొయినాబాద్: చెరువులు, కుంటలు, నాలాలను పరిరక్షించాలని ఓ వైపు ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో చేపట్టిన నిర్మాణాలను తొలగిస్తుంటే కొందరు మాత్రం చెరువులనే మాయం చేసేస్తున్నారు. చెరువు కట్టను పూర్తిగా తొలగించి, ఆనవాళ్లు లేకుండా చేసే పనిలో ఉన్నారు. మొయినాబాద్ మండలంలోని బాకారం జాగీర్ రెవెన్యూలో ఈతతంగం సాగుతోంది. వివరాల్లోకి వెళ్తే.. బాకారం జాగీర్ రెవెన్యూలోని సర్వే నంబర్ 11, 12లో జంబులకుంట చెరువు ఉంది. 21 ఎకరాల్లో విస్తరించిన ఉన్న చెరువు భూమిలో శిఖం పట్టాలున్నాయి. చెరువులోని నీళ్ల ఇంకిపోయినప్పుడు మాత్రమే సంబంధిత వ్యక్తులు ఇందులో పంటలు సాగు చేసుకోవాలి. ఈ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు. ఇతర అవసరాలకు సైతం వాడుకోవద్దు. కానీ కొంతమంది ఈ నిబంధనలను పట్టించుకోకపోవడంతో పాటు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. శిఖం పట్టాలను అడ్డం పెట్టుకుని కొందరు చెరువు ఆనవాళ్లకే ఎసరు పెడుతున్నారు. ఈ క్రమంలో కట్టను పూర్తిగా తొలగించారు. ఈ విషయం గుర్తించిన స్థానికులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువును కాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిమాండ్ చేస్తున్నారు



బాకారం జాగీర్‌లో జంబులకుంట చెరువు కట్టను తొలగించిన దృశ్యం

గ్రామసభలు తూతూ మంత్రం!



దౌల్తాబాద్‌లో గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ శిరీష(ఫైల్)

- కనిపించని ప్రజల భాగస్వామ్యం
- అవగాహన కల్పించని అధికారులు

దౌల్తాబాద్: పల్లెల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామసభలను నిర్వహిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో ప్రజల భాగస్వామ్యం లేకపోవడంతో ఇవి తూతూమంత్రంగా కొనసాగుతున్నాయి. అవగాహన కల్పించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పంచాయతీల అభివృద్ధిలో గ్రామసభలు ఎంతో కీలకం. ఆయా శాఖల అధికారులతో పాటు పంచాయతీ పాలకవర్గం సభ్యులు, ప్రజలు ఇందులో పాల్గొని సమస్యలను గుర్తించి, పరిష్కార మార్గాలపై చర్చిస్తారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు, లబ్ధిదారుల వివరాల నమోదును గ్రామ సభల ద్వారా నిర్వహిస్తారు. ప్రభుత్వాలు చేపట్టే కొత్త పథకాలు, పనులపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటారు.

నిర్వహణ ఇలా..

పంచాయతీల్లో ప్రతీ రెండు నెలలకు ఒకసారి సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించాలి. అయితే ఏడాదిఎకాలంగా సర్పంచ్‌లు లేకపోవడంతో కార్యదర్శులే నిర్వహిస్తున్నారు. సంబంధిత జీపీతో పాటు అనుబంధ గ్రామాల్లో సభలు నిర్వహించే తేదీలను ముందుగానే ప్రకటించాలి. ఈ విషయమై సిబ్బందితో టాంటాం(దండోరా) వేయించాలి. నిబంధనల ప్రకారం విధిగా 17శాఖల అధికారులు జనాభాలో సుమారు 20శాతం మంది ప్రజలు గ్రామసభకు హాజరయ్యేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ ఇవేవీ పట్టించుకోవడం లేదు. కనీసం 50 మందితో గ్రామసభ నిర్వహించాలనే నిబంధనలు ఉన్నా పది మందితో కానిచ్చేస్తున్నారు. పంచాయతీ ఆదాయ, వ్యయాలపైన కార్యదర్శులు నివేదికలు చదివి వినిపించాల్సి ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆసక్తి చూపని గ్రామస్తులు..

జిల్లాలోని చాలా చోట్ల నిర్వహించే గ్రామసభలకు కనీసం పది నుంచి ఇరవై మంది కూడా రావడం లేదు. ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు, వీఓఏలు, వైద్యసిబ్బంది మాత్రమే సభలకు హాజరవుతున్నారు. ప్రజలు, నాయకులకు సరైన సమాచారం ఉండటం లేదు. గ్రామ సభల్లో చర్చకు వచ్చే సమస్యలకు పరిష్కారం చూపితే వీటిపై గౌరవం పెరిగే అవకాశం ఉంటుంది. కానీ గ్రామాల్లో సమస్యలు పేరుకుపోవడం, సుదీర్ఘకాలంగా పరిష్కారం కాకపోవడం వంటి కారణాలతో సభలకు ఆదరణ తగ్గుతోంది.

ప్రజల భాగస్వామ్యం పెరగాలి



గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాలి. సభల నిర్వహణపై కార్యదర్శులతో గ్రామాల్లో దండోరా వేయిస్తున్నాం. సమాచారం తెలుసుకుని స్వచ్ఛందంగా సభకు రావాలి. దీంతో సమస్యలు పరిష్కరించే వీలు కలుగుతుంది.

– శ్రీనివాస్, ఎంపీడీఓ, దౌల్తాబాద్



షాద్‌నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గణితం బోధిస్తున్న పాండురంగయ్య



కుష్మసముద్రం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మోటివేషనల్ క్లాస్ చెబుతున్న రిటైర్డ్ హెచ్‌ఎం పాండురంగయ్య

పాండురంగ.. సేవలు వరంగా

- పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషిచేస్తున్న గురువు
- ఉద్యోగ విరమణ పొందినా నిత్యం విధులకు హాజరు
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సొంత డబ్బులతో వసతుల కల్పన
- ఆదర్శంగా నిలుస్తున్న రిటైర్డ్ గెజిటెడ్ హెచ్‌ఎం పాండురంగయ్య

కుల్కచర్ల: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సరదాగా గడపడంతో పాటు ఇతర వ్యాపకాల వైపు దృష్టిసారిస్తారు. వారికి ఇష్టమైన వ్యాపారం, వ్యవసాయం, మొక్కల పెంపకం.. ఇలా తమ అభిరుచులకు తగిన పనులకు ప్రాధాన్యం ఇస్తుంటారు. కానీ కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేసి, రిటైరైన ప్రధానోపాధ్యాయుడు పాండురంగయ్య విద్యార్థుల శ్రేయస్సు కోసం పాఠాలు కొనసాగిస్తున్నారు. ఈయన సేవలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వరంగా మారాయి.

ప్రతిరోజూ బడికి..

హెచ్‌ఎం పాండురంగయ్య గత నెల 24న ఉద్యోగ విరమణ పొందారు. కానీ ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు ఉన్న నేపథ్యంలో మంచి ఫలితాలు రావాలనే లక్ష్యంతో నిత్యం బడికి వస్తున్నారు. ఎప్పటిలాగే సమయానికి స్కూల్‌కు చేరుకుని పిల్లలకు గణితం బోధిస్తున్నారు. అంతేకాకుండా దోమ, షాద్‌నగర్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మ్యాథ్స్‌పై ప్రత్యేక తరగతులు చెప్పడంతో పాటు పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలను వివరిస్తూ మోటివేషనల్ క్లాసులు నిర్వహిస్తున్నారు.

సేవా కార్యక్రమాల్లోనూ ఆదర్శమే

షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన పాండురంగయ్య 13జూన్ 2024లో ఇప్పాయిపల్లి ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ హెచ్‌ఎంగా విధుల్లో చేరారు. అనతికాలంలోనే విద్యార్థుల నడవడికలో మార్పులు తీసుకురావడంతో పాటు వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తూ మౌలిక వసతుల కల్పన కోసం తన సొంత డబ్బులు వెచ్చించారు. తాను పనిచేస్తున్న పాఠశాలలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తమవంతు సాయం అందించేందుకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వాసవి క్లబ్‌కు ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన ఇప్పాయిపల్లి స్కూల్ విద్యార్థులకు వైట్ అండ్ వైట్ దుస్తులు, టై, బెల్టు, షూస్ అందజేయడంతో పాటు వాటర్ ప్యూరిఫయర్ వంటి సౌకర్యాలను కల్పించారు.

ఉన్నతిలోకి రావాలి



గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు నావంతు కృషి చేస్తున్నా. ఉద్యోగ విరమణ అనేది నా ఉద్యోగ జీవితంలో ఒక భాగమే. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల అవసర నిమిత్తం నా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తా. పేద పిల్లలు ఉన్నతిలోకి రావాలనేదే నా సంకల్పం.

– పాండురంగయ్య, రిటైర్డ్ హెచ్‌ఎం

హీరో విశ్వక్సేన్ సోదరి ఇంట్లో చోరీ

ఫిలింనగర్: ఫిలింనగర్ రోడ్డునెంబర్–8లో నివసించే సినీ హీరో విశ్వక్సేన్ సోదరి గదిలో భారీ చోరీ జరిగింది. ఈ మేరకు ఆమె తండ్రి సి.రాజు ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే..రాజు కూతురు మూడో అంతస్తులో ఉంటుంది. తెల్లవారి తన గదిలో వస్తువులు చిందరవందరగా పడి ఉండడం చూసి ఆమె ఆందోళన చెందింది. పరిశీలించగా రెండు బంగారు డైమండ్ ఉంగరాలతో పాటు ఒక హెడ్‌ఫోన్ కనిపించలేదు. దీంతో విషయాన్ని తన తండ్రి దృష్టికి తీసుకువచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకుని క్లూస్ టీం సహాయంతో వేలి ముద్రలు సేకరించారు. ఇక్కడి సీసీ ఫుటేజీలను పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి తెల్లవారుజామున 5.50 గంటల ప్రాంతంలో ఇంటి ముందు బైక్ పార్కు చేసినట్లుగా గుర్తించారు. సదరు వ్యక్తి గేటు తీసుకుని నేరుగా మూడో అంతస్తుకు వెళ్లి వెనుక డోర్ నుంచి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి అల్మారాలో నుంచి బంగారు వస్తువులు తస్కరించినట్లుగా గుర్తించారు. సరిగ్గా 20 నిమిషాల్లోనే దొంగిలించిన సొత్తుతో సదరు వ్యక్తి బయటకు రావడం, వెళ్లిపోవడం కూడా సీసీ ఫుటేజీలో నమోదైంది. చోరీకి గురైన బంగారం విలువ రూ.2.20 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిలింనగర్ పోలీసులు దొంగ కోసం గాలింపు చేపట్టారు. ఇక్కడి సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అనుమానితుల కదలికలపై దృష్టి పెట్టారు. పాత నేరస్తుల కదలికలను కూడా గమనిస్తున్నారు. ఇంత ధైర్యంగా గేటు తీసుకుని నేరుగా మూడో అంతస్తుకు వెళ్లడం, దర్జాగా బయటకు వెళ్లిపోవడం చూస్తుంటే ఇది తెలిసిన వారి పని అయి ఉంటుందని భావిస్తున్నారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో 57 కిలోల గంజాయి పట్టివేత

ఇరువురు నిందితుల రిమాండ్

సికింద్రాబాద్: ఒడిశా నుంచి దాదర్‌కు గంజాయి రవాణా చేస్తున్న ఇరువురు వ్యక్తులను సికింద్రాబాద్ జీఆర్‌పీ, నార్కోటిక్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.28.50 లక్షల విలువ చేసే 57 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా తీరును శనివారం రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావెద్ విలేకరులకు వెల్లడించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఈనెల 14న జీఆర్‌పీ, నార్కోటిక్ పోలీసులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా..10వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఆగిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఇరువురు ప్రయాణికులు అనుమానాస్పదంగా కనిపించారు. వారి లగేజీని తనిఖీ చేయగా అందులోంచి 57 కిలోల గంజాయి ప్యాకెట్లు బయట పడ్డాయి. ముంబైకి చెందిన జీవన్ అనే వ్యక్తి అక్కడే టీవీ నటులకు మేకప్ మెన్‌గా పనిచేసే వాడు. ఒడిశాకు చెందిన సుశాంత్‌కుమార్ స్వైన్ (23) ప్రైవేటు ఉద్యోగి, మహారాష్ట్ర విహార్ వెస్ట్‌కు చెందిన కరణ్ అయ్యప్పన్‌సెట్టి (26) కారు డ్రైవర్. గంజాయికి బానిసైన సుశాంత్‌కుమార్, ఆర్థిక సమస్యల్లో ఉన్న కరణ్ అయ్యప్పన్ వేరువేరు సందర్భాల్లో జీవన్‌కు పరిచయం అయ్యారు. తమ ఇబ్బందులను జీవన్‌కు చెప్పుకుని సహాయం అడిగారు. ఆర్థిక సహాయం కావాలని సుశాంత్‌కుమార్, ఉద్యోగం చూపించాలని కరణ్ అయ్యప్ప జీవన్‌ను వేడుకున్నారు. వీరిద్దరికి సహాయం చేస్తానని నమ్మబలికిన జీవన్ ఇరువురిని బెర్హంపూర్‌కు రప్పించి అక్కడ ఒక లాడ్జిలో బస ఏర్పాటు చేశాడు. నాలుగు రోజులు బస చేసిన అనంతరం గంజాయి రవాణా ప్రణాళికను ఇరువురికి వివరించాడు. ఒడిశా నుంచి గంజాయి రవాణా చేయడం ద్వారా పెద్దమొత్తంలో డబ్బు వస్తుందని, ముగ్గురం సమానంగా పంచుకుందామని చెప్పడంతో అప్పటికే మాదక ద్రవ్యాల వినియోగం, క్రికెట్ బెట్టింగులతో ఆర్థికంగా చితికిపోయి ఇబ్బందుల్లో ఉన్న సుశాంత్ కుమార్, కరణ్ అయ్యప్పన్ చేతులు కలిపారు. లాడ్జి నుంచి అటవీ ప్రాంతానికి వెళ్లి అక్కడ ఒక వ్యక్తి నుంచి గంజాయిని స్వీకరించారు. 28 ప్యాకెట్ల గంజాయిని మూడు ట్రాలీ సూట్‌కేసుల్లో భర్తీ చేసుకుని కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ముగ్గురు కలిసి బయలుదేరారు. సుశాంత్‌కుమార్, కరణ్ అయ్యప్పన్ జనరల్ బోగీలో నిద్రపోయారు. రైలు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటున్న సందర్భంలో పోలీసుల సోదాలను పసిగట్టిన జీవన్ బోగీ నుంచి తప్పించుకుని పారిపోగా మిగతా ఇరువురు పోలీసులకు పట్టుబడ్డారు. కేసు నమోదు చేసుకుని జీవన్ కోసం గాలిస్తున్నారు. పోలీసులు సుశాంత్‌కుమార్, కరణ్ అయ్యప్పన్‌లను రిమాండ్‌కు తరలించారు.

హజ్ వీసా జారీకి ఏప్రిల్ 18 వరకు గడువు

సాక్షి, సిటీబ్యూరో : హజ్ వీసా జారీకి ఏప్రిల్ 18వ తేదీని తుది గడువుగా సౌదీ అరేబియా హజ్, ఉమ్రా మంత్రిత్వశాఖ నిర్ణయించినట్లు హజ్ ఉమ్రా గ్రూప్ ఆర్గనైజర్స్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు అల–హాజ్ మహమ్మద్ అబ్దుల్‌రజాక్ క్వమర్ తెలిపారు. నాంపల్లిలోని మీడియా ప్లస్ ఆడిటోరియంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హజ్ యాత్రికులు గడువులోగా తమ బుకింగ్‌లను తెలంగాణ, ఏపీ ప్రైవేట్ హజ్ గ్రూప్ ఆపరేటర్ల ద్వారా పూర్తి చేసుకోవాలన్నారు. సాధారణంగా హజ్ వీసాలు ఒక వారం ముందు వరకూ జారీ చేస్తారని..అయితే మారిన కొత్త నిబంధనల ప్రకారం నెల ముందే వీసా జారీ చేస్తారని చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సిరాజ్ ఖాన్, ఫహీమ్ దియానీ, మహమ్మద్ అజీం ఉద్దీన్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరిట ఘరానా మోసం

గచ్చిబౌలి: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నమ్మించి ఫేక్ ఆఫర్ లెటర్లు ఇచ్చిన ఘరానా మోసగాడిని రాయదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా మందమురు మండలం అయోధ్యనగర్‌కు చెందిన నల్రావుల గోపీ అలియాస్ గోపీరెడ్డి (24) నాలెడ్జి సిటీలోని ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. ముగ్గురు నిరుద్యోగుల నుంచి అడ్వాన్స్‌గా రెండున్నర లక్షల తీసుకొని జాబ్ వచ్చిన తరువాత మరో ఐదు లక్షలు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆఫర్ లెటర్ తీసుకొని కంపెనీకి వెళ్లగా ఫేక్ అని తెలియడంతో బాధితులు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

న్యాయం చేయాలని ఎస్పీకి వినతి



ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు అనంతరం శోభ, కుటుంబ సభ్యులు

పూడూరు: సాగు చేస్తున్న భూమిని వదిలేయాలని ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని చన్గోముల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేస్తే ఎస్ఐ పట్టించుకోవడం లేదని బాధిత మహిళ శోభ శనివారం జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పూడూరు మండల పరిధిలోని పుడుగుర్తి గ్రామానికి చెందిన నాగులపల్లి శోభ గ్రామంలోని సర్వే నంబర్ 54లో 0–23 గుంటల భూమిని కొంత కాలంగా సాగు చేస్తున్నానని తెలిపింది. కొంత కాలంగా తమ కుటుంబంలో భూమి విషయంలో కోర్టులో కేసు నడుస్తుంది. ఇది ఇలా ఉండగా వారు ఆ భూమి విషయంలో రాజీ కుదుర్చుకున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆ భూమికి ఎలాంటి సంబంధం లేని వడ్డె ఎల్లయ్య, శ్రీను, చంద్రయ్య, లక్ష్మయ్య, కాశీనాథ్‌లు తమ భూమిని లాక్కోవడానికి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దాడి చేసి తనను చంపడానికి ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తనను రక్షించాలని, భూమి జోలికి రాకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐకి ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదు. దీంతో ఎస్ఐ కూడా తననే బెదిరిస్తున్నారని ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని కోరుతూ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఎస్పీని కలిసిన వారిలో మాజీ ఎంపీపీ మల్లేశం, దేవనోనిగూడ వెంకటయ్య, బాధిత కుటుంబసభ్యులు ఉన్నారు.

సిలిండర్ గ్యాస్‌లీకై..నిప్పురవ్వలు ఎగసిపడి

ఆరుగురికి గాయాలు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్ఎఫ్ బృందం

మణికొండ: ఐటీ సంస్థలకు నిలయమైన ఓ బహుళ అంతస్తుల టవర్‌లో క్యాంటీన్ ఏర్పాటు పనులు చేస్తున్న క్రమంలో వెల్డింగ్ సిలిండర్ లీకై ..నిప్పురవ్వలు ఎగసిపడి ఆరుగురికి గాయాలయ్యాయి. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేటలోని ఘర్ (జీఏఆర్) భవనంలో అనేక ఐటీ సంస్థలు కొనసాగుతున్నాయి. వారికి అనుకూలంగా ఉండేలా గ్రౌండ్ ఫ్లోర్‌లో కొత్తగా క్యాంటీన్ ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. శనివారం సాయంత్రం వెల్డింగ్ చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా సిలిండర్ నుంచి గ్యాస్ అధికంగా విడుదలై నిప్పు రవ్వలు చెలరేగాయి. దీంతో అక్కడే ఉన్న క్యాంటీన్ యజమాని రాకేష్‌తో పాటు కార్మికులు రిజ్వాన్, అన్వర్ మాలిక్, శివ, ఫరూఖ్ మాలిక్, రాజు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే సమీపంలోని కాంటినెంటల్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అందులో ఒకరికి 50 శాతం, మరొకరికి 40 శాతం, నలుగురికి 30 శాతం కాలిన గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న నార్సింగి ఏసీపీ రమణగౌడ్, వట్టినాగులపల్లి అగ్నిమాపక శాఖ అధికారులు, హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు అక్కడికి చేరుకున్నారు. అయితే అది అగ్ని ప్రమాదం కాదని, వెల్డింగ్ మిషన్ వద్ద గ్యాస్, అగ్గి రవ్వలు అధికంగా రావటంతో ప్రమాదం జరిగిందని ఏసీపీ తెలిపారు.